వైద్యుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు, సిబ్బందిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన క్రూరమృగాలను కఠినంగా శిక్షించాలి. వైద్య, ఆరోగ్య సిబ్బంది రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

– డాక్టర్ హరీష్, నర్రవాడ పీహెచ్‌సీ

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి. వైద్య, ఆరోగ్య సిబ్బంది భద్రతకు ప్రత్యేక చట్టాలు అవసరం. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో రాత్రి వేళ పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ రక్షణ కల్పించాలి.

– ప్రభావతి, సీనియర్ ఫార్మసిస్ట్, చేజర్ల పీహెచ్‌సీ

రక్షణ లేకుంటే ఎలా..?



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుంటే ఎలా? విధులకు వెళ్లిన వారు ఎలా ఉన్నారోనని ఇంట్లో తల్లిదండ్రులు టెన్షన్ పడరా? కోల్‌కతా ఘటన వైద్యుల్లో ఒకింత భయాన్ని నెలకొల్పింది. ప్రభుత్వం కచ్చితంగా రక్షణపై ఫోకస్ పెట్టాలి. మేం ప్రశాంతంగా ఉంటేనే కదా రోగులకు సేవలందించేందుకు వీలవుతుంది.

– డాక్టర్ భారతి, మెడికల్ ఆఫీసర్, కోవూరు



పాహిమాం.. రక్షమాం

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయం, గెస్ట్ హౌస్, క్యాంప్ ఆఫీస్‌లో మొక్కలను ఎస్పీ శుక్రవారం నాటారు. అదే విధంగా ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 500 మొక్కలు నాటారు. ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, ఆర్ఐలు అంకమరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో 'జెనెక్స్' ప్రతిభ



విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్): సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ విజన్ అకాడమీ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ర్యాంకులను సాధించారని అకాడమీ డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను హరనాథపురంలోని అకాడమీలో అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో తేజకృష్ణ 453 మార్కులతో 37.. జగదీష్ 448 మార్కులతో 41వ ర్యాంకులను సాధించారని చెప్పారు. సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో దాక్షాయణి 420, మునిసిద్ధార్థ 415, రూప 384, సాహిత్య 363, దీపిక 323, పవన్ 313 మార్కులను సాధించారని వివరించారు. డీజీఎం రఫీ, ఏజీఎం గౌరి, అకాడమీ ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



నెల్లూరు సిటీ: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారికి అభిషేకం, పల్లకిసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, కుటుంబసభ్యులు వ్యవహరించారు.

అరియర్స్ చెల్లించాలంటూ నిరసన



నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగులకు అన్ని రకాల అరియర్స్‌ను వెంటనే చెల్లించాలంటూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసనను శుక్రవారం చేపట్టారు. వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఎన్ఎంయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ రెడ్డి, జోనల్ కార్యదర్శి లూక్సన్, జిల్లా చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఒకటో, రెండో డిపోల కార్యదర్శులు చెంచయ్య, సునీల్, ఉదయ్‌శంకర్, డీఎంకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ: నగరంలోని 20వ డివిజన్లో గల సంఘమిత్ర పాఠశాల వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం చేపట్టారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ చేజర్ల మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి కంటే సాయిబాబా, నేతలు దారా మల్లి, ఖాదర్‌బాషా, అన్నంగి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకారంలో రాజరాజేశ్వరి



నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో..

• భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస నాలుగో శుక్రవారాన్ని నగరంలోని వివిధ ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సామూహికంగా నిర్వహించిన లక్ష కుంకుమార్చనలకు భక్తులు తరలివచ్చారు.

➡ నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చనను నిర్వహించారు. అనివెట్టి మండపంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. మూలవర్లను వేరుశనగకాయలు, పప్పులతో అలకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకిసేవను నిర్వహించారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో లక్షకుంకుమార్చనను నిర్వహించారు. ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను రాత్రి జరిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతామహాలక్ష్మికి కుంకుమపూజ, పల్లకిసేవను నిర్వహించారు. సంతానలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బృందావనం శ్రీనివాసదీక్షితులు, వెంకటనారాయణశర్మ, రమాదేవి దంపతులు వ్యవహరించారు. వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

➡ వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో వైభవలక్ష్మి అమ్మవారికి పూజలను ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తగా చిత్తూరు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, వేణుబాబు, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, నరసింహయాదవ్ తదితరులు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష కుంకుమార్చనను నిర్వహించారు.



కుంకుమపూజకు హాజరైన మహిళలు



సీతారామస్వామి మందిరంలో..

అలంకారప్రాయం..

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని కలెక్టరేట్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయ్‌లెట్లు అలంకారప్రాయంగా మారాయి. నీటి సౌకర్యం లేకపోవడంతో వీటిని మూసేశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సందర్భంగా కావలి నియోజకవర్గం నుంచి పలువురు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణానికి తరలివచ్చారు. అయితే టాయ్‌లెట్లు లేక వీరు నానా ఇబ్బందులు పడ్డారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కలెక్టరేట్ ప్రాంగణంలోని మరుగుదొడ్లు

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పీఎం సూర్యఘర్ యోజన, విద్యుత్ ప్రమాదాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల తన చాంబర్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఒక కుటుంబానికి రెండు కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను మంజూరు చేయనున్నామని వివరించారు. కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్ల కంటే ఎక్కువ సామర్థ్యం గల వాటి ఏర్పాటుకు రూ.78 వేలను రాయితీ రూపంలో కేంద్ర ప్రభుత్వం అందజేయనుందని వివరించారు.



మాట్లాడుతున్న విజయన్

మొక్కలను విరివిగా నాటాలి



నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకు మొక్కలను విరివిగా నాటాలని పలువురు పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో గల పార్కులో మొక్కలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాటారు. టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అరవ శ్రీనివాసులు, అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఈ చంద్రయ్య, టీపీఆర్వో ప్రసాద్, ఏఈ అర్పిత తదితరులు పాల్గొన్నారు.

వేలంలో దక్కించుకున్న వారే వ్యాపారం చేయాలి

• మంత్రి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బారకాసు): మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలోని ప్రభుత్వ దుకాణాలను ఒకరు వేలంలో దక్కించుకుంటే.. మరొకరు రాజకీయ బలం, రౌడీయిజంతో బలవంతంగా లాక్కుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మండిపడ్డారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి ఆయా విభాగాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. సీజ్ చేసిన దుకాణాలపై సమగ్ర నివేదికలివ్వాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో 223 దుకాణాలకు అద్దెకిచ్చారని, అయితే ఈ వ్యవహారంలో కొంత అవకతవకలున్నాయని, దీనిపై అధికారులు దాడులు నిర్వహించి 52 దుకాణాలను క్లోజ్ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో తనను పలువురు సంప్రదించడంతో.. ఈ అంశమై చర్చించేందుకు అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశానన్నారు. 20, 30 ఏళ్లుగా ఆయా దుకాణాల్లో ఉంటున్న వారిని వెళ్లిపోవాలనడం న్యాయం కాదని, దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సవ్యంగా ఉంటే అదే షాపుల్లో వ్యాపారాలు చేసుకునే వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైలకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలోని 27 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పించి జిల్లాలకు కేటాయిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులను శుక్రవారం రాత్రి జారీ చేశారు. జిల్లాకు చెందిన ఏఎస్సైలు మహబూబ్‌బాషా, సుధీర్‌కుమార్, శీనయ్య, గౌస్‌బాషా, ఖాదర్‌బాషా, జానకిరామిరెడ్డి, తిరుమలరెడ్డి, దాదా సాహెబ్, బ్రహ్మయ్య, శ్రీనివాస్ సింగ్, ముక్తియార్‌బాషా, శ్రీనివాసులు, సుల్తాన్‌బాషా, శీనయ్య, శ్రీనివాసులు, సుబ్బారావు, నాగరాజు, శ్రీనివాసరావు, నాగరాజు, శివయ్య, మనోహర్‌రెడ్డి, శేషుబాబు ఉద్యోగోన్నతి పొందారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో శుక్రవారం విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం జరిగింది. ఇందులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని మాట్లాడారు.

ఖలీల్‌కు కాకాణి పరామర్శ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. జెండావీధిలోని ఖలీల్ ఇంటికెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేద్దాం

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామమని, దీన్ని విజయవంతం చేద్దామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడారు.

ముగిసిన కృష్ణాష్టమి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ మెయిన్ రోడ్డులోని పిండిమిల్లు సెంటర్‌లో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి ఉట్టి మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చిన బాలకృష్ణుడి నగరోత్సవాన్ని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం పవిత్ర పినాకినీ నదిలో బాలకృష్ణుడ్ని నిమజ్జనం చేశారు. కమిటీ కన్వీనర్ కొట్టే వెంకటేశ్వర్లు, సుమంత్, దుర్గ, రమేష్, వెంకట్రావ్, చరణ్, విజయ్, చందు, సురేష్, శేఖర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా పింఛన్ల పంపిణీ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ఇంటింటికీ తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ప్రణాళికబద్ధంగా అందజేయాలని కమిషనర్ సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 165 సచివాలయాల్లో గల లబ్ధిదారులకు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు గానూ 27 మంది నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. శనివారం ఉదయం ఆరు నుంచి రాత్రి ఏడులోపు పంపిణీ చేయాలని ఆదేశించారు.

కంటైనర్ టెర్మినల్ కోసం ఉద్యమం



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కృష్ణపట్నంలోని అదానీ పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించి.. పది వేల మందికి ఉపాధిని కాపాడటంతో పాటు జిల్లా అభివృద్ధికి ఉద్యమాలు సాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, గోగుల శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. ఇతర పోర్టుల్లో వ్యాపార లావాదేవీల కోసం కృష్ణపట్నం, జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెట్టడం సరికాదని హితవు పలికారు. ఈ విషయమై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోర్టుకు వెళ్లి పరిశీలించారని, అయితే అక్కడ ఎలాంటి మార్పులు జరగడంలేదని అసెంబ్లీలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ ఈ విషయంలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కంటైనర్ టెర్మినల్‌ను సాధించేంత వరకూ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. నేతలు గడ్డం అంకయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



నెల్లూరు(అర్బన్): నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలతో ఎంతో మానసికోల్లాసం లభిస్తుందని ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ పోటీలను శుక్రవారం జరిపారు.

నేర నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కోరారు. కోటమిట్ట, మెక్లిన్స్‌రోడ్డు, విరాట్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మత్తు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ఈవ్‌టీజింగ్, మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తమ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తిస్తే డయల్ 100, 112 లేదా తమకు సమాచారమివ్వాలని కోరారు.

విశేషాలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న కృష్ణావతార మహోత్సవాల్లో భాగంగా స్వామివారు పొన్నవాహనంపై శుక్రవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చైతన్యకుమార్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.